సాక్షి పెద్దపల్లి

గురువారం : 27 : ఫిబ్రవరి : 2025

పోలింగ్‌కు వేళాయె

- పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం
- నాలుగు ఉమ్మడి జిల్లాల్లో 773 పోలింగ్ కేంద్రాలు
- గ్రాడ్యుయేట్స్ 499, టీచర్స్ 274, ఉమ్మడిగా 93 పోలింగ్ కేంద్రాలు
- ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్
- పట్టభద్రుల బరిలో 56మంది, ఉపాధ్యాయపోటీలో 15 మంది
- అత్యధిక ఓటర్లతో కరీంనగర్ జిల్లాలో 103 పోలింగ్ కేంద్రాలు
- 12రకాల గుర్తింపు కార్డులతో ఓటేసేందుకు అనుమతి
- వచ్చే నెల 3న కౌంటింగ్



పెద్దపల్లిలోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజవర్గాల ఎన్నికలకు సర్వం సిద్ధమైంది. మొత్తం 15 జిల్లాలు 42నియోజకవర్గాల్లో ఏర్పాట్లు పూర్తి చేశారు. కరీంనగర్ కేంద్రంగా జరుగుతున్న ఈ ఎన్నికలకు కలెక్టర్ పమేలా సత్పతి రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. బుధవారం ఉదయమే డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సామగ్రితో సిబ్బంది, పోలీసులు వారికి కేటాయించిన పోలింగ్ స్టేషన్లకు చేరారు. నోటిఫికేషన్ విడుదలైన నాటినుంచి హోరాహోరీ ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు బుధవారం పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టిసారించారు. ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, నిజామాబాద్‌లో మొత్తం 773 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఆర్వో పమేలాసత్పతి తెలిపారు. గ్రాడ్యుయేట్స్ కోసం 499, టీచర్స్ కోసం 274, ఉమ్మడిగా 93 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. అత్యధిక ఓటర్లతో కరీంనగర్ జిల్లా 103 పోలింగ్ కేంద్రాలు కలిగి ఉంది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, ఓటరు కార్డుతో సహా 12 రకాల గుర్తింపు కార్డులతో ఓటు వేయవచ్చని తెలిపారు. ఈ పట్టభద్రుల బరిలో 56 మంది, ఉపాధ్యాయ పోటీలో 15 మంది ఉన్నారు.

కేంద్రాలకు చేరిన ఎన్నికల సామగ్రి

ఎమ్మెల్సీ ఎన్నికలో విధులు నిర్వహించే పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులు, పేపర్లు ఇతర సామగ్రితో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ప్రత్యేక బస్సుల్లో పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌కు ఒక ప్రిసైడింగ్ ఆఫీసర్, అదనపు ప్రిసైడింగ్ ఆఫీసర్, మరో ఉద్యోగితో పాటు భద్రతకు పోలీసులను కేటాయించారు. వీరంతా గురువారం ఉదయం 6.30గంటలకు పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు ప్రారంభిస్తారు. 7గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోలింగ్ నిర్వహిస్తారు. ప్రతీ కేంద్రం వద్ద వెబ్‌కాస్టింగ్‌తో పాటు సీసీ కెమెరాలతో నిఘాను ఏర్పాటు చేశారు. పోలింగ్‌కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో ఉంటున్నందున కేంద్రానికి 100మీటర్ల పరిధిలో ఎవరూ ఉండకూడదని పోలీసులు సూచించారు. పోలింగ్ అనంతరం సిబ్బంది బ్యాలెట్ బాక్సులను సీజ్ చేసి కరీంనగర్‌లోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంకు తరలిస్తారు. మొత్తం 15జిల్లాల్లోని 271మండలాల నుంచి బ్యాలెట్ బాక్సులు శుక్రవారం ఉదయంలోపు ఇక్కడికి చేరనున్నాయి.

మొత్తం పోలింగ్ కేంద్రాలు	773
పట్టభద్రుల కేంద్రాలు:	499
టీచర్స్ కేంద్రాలు:	274
ఉమ్మడి కేంద్రాలు	93
మైక్రో అబ్జర్వర్లు:	394
జోనల్ అధికారులు:	335
ప్రిసైడింగ్ అధికారులు:	864
అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు:	2606
మొత్తం పోలింగ్ సిబ్బంది:	4,199

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో 56మంది.. 3,55,159ఓట్లు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ నుంచి అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణతో కలిపి మొత్తం 56మంది పోటీ పడుతున్నారు. 3,55,159మంది ఓటర్లు 499పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఉమ్మడి కరీంనగర్ వ్యాప్తంగా 1,60,260మంది పట్టభద్రులు, 200పోలింగ్ కేంద్రాల్లో ఓటేయనున్నారు.

టీచర్స్ బరిలో 15మంది.. 27,088 ఓటర్లు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్, యూటీఎఫ్, యూఎస్‌పీసీ మద్దతుతో వై.అశోక్‌కుమార్, ఎస్టీయూ, సీపీఎస్‌ల నుంచి కూర రఘోత్తంరెడ్డిలతో కలిపి 15మంది ఉన్నారు. 274 పోలింగ్ కేంద్రాల్లో 27,088మంది ఓటు వేయనున్నారు. ఉమ్మడి కరీంనగర్‌లో 8,135 మంది 65పోలింగ్ కేంద్రాల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

ఓటు ఇలా వేయాలి..

పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో
56మంది
ఓటర్లు
3,55,159
టీచర్స్ ఎమ్మెల్సీ బరిలో
15మంది
ఓటర్లు 27,088

- ఓటర్లు వారు ఓటు వేసే అభ్యర్థికి ఎదురుగా బ్యాలెట్ పేపర్‌లో ఎన్నికల సంఘం సరఫరా చేసిన వాయిలెట్ స్కెచ్‌పెన్ ద్వారా మాత్రమే ఓటు వేయాలి.
- ఎంచుకున్న అభ్యర్థికి ఎదురుగా 1, 2, 3, 4 ప్రాధాన్య క్రమంలో మాత్రమే అంకెల రూపంలో ఓటేయాలి.
- మొదటి ప్రాధాన్య ఓటుగా 1వ అంకెను అభ్యర్థికి ఎదురుగా ఉన్న స్థలంలో మాత్రమే మార్కు చేయాలి. ఎంతమంది అభ్యర్థులు పోటీలో ఉన్నా, బ్యాలెట్ పేపర్‌లో పోటీలో ఉన్న అభ్యర్థుల పేర్లకు ఎదురుగా 1, 2, 3 వంటి అంకెల రూపంలో మాత్రమే ప్రాధాన్య క్రమంలో ఓటేయాలి.

ఇలా చేయకూడదు...

- బ్యాలెట్ పేపర్‌లో ఇద్దరు అభ్యర్థులకు మొదటి ప్రాధాన్య ఓటు 1వ సంఖ్య ఇవ్వకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై సంతకం చేయడం, ఇనిషియల్ వేయడం, పేరు, అక్షరాలు వంటివి రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై 1, 2, 3, 4, 5 సంఖ్యల రూపంలో మాత్రమే ప్రాధాన్యాన్ని ఇవ్వాలి. పదాల రూపంలో, వన్, టూ, త్రీ అని రాయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై రైట్ మార్క్ టిక్ చేయడం లేదా ఇంటూ మార్కు పెట్టడం వంటివి చేయకూడదు.
- ఒకే అభ్యర్థికి రెండు ప్రాధాన్యాలు ఇవ్వకూడదు. ఉదాహరణకు ఒకే అభ్యర్థికి 1, 2 సంఖ్యలు వేయకూడదు.
- బ్యాలెట్ పేపర్‌పై అభ్యర్థికి కేటాయించిన స్థలంలో గాక ఇతర ప్రాంతాల్లో 1, 2, 3 అంకెలు వేయకూడదు.

పొరపాట్లు లేకుండా పోలింగ్

- పకడ్బందీగా విధులు నిర్వహించాలి
- కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు

పెద్దపల్లిరూరల్: పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలను పొరపాట్లు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ మైదానంలో బుధవారం ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పోలింగ్ సామగ్రిని అధికారులు, సిబ్బందికి అందించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు, సిబ్బంది ని బంధనలను కచ్చితంగాపాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల ఏర్పాటు..

జిల్లాలో దాదాపు 31 వేల మంది పట్టభద్రులు ఓటర్లుగా నమోదయ్యారని, వారు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు 36 పోలింగ్ కేంద్రాలను, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కోసం 1,100 మంది ఉపాధ్యాయులు ఓటర్లు తమ పేర్లు నమోదు చేసుకున్నారని, వారికోసం 14 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా, వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని చల్లనినీరు, టెంట్ లాంటి సౌకర్యాలు కల్పించామని అన్నారు. ఓటర్లు గురువారం జరిగే ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ వేణు, ఆర్డీవోలు గంగయ్య, సురేశ్, డీపీవో ఆది రెడ్డి, ఆర్టీవో రంగారావు తదితరులు ఉన్నారు.



అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

అధికార యంత్రాంగం అప్రమత్తం

- దోమల నియంత్రణకు ఫాగింగ్ • ఖాళీ ప్లాట్లలో మురుగునీరు తొలగిస్తాం
- 'సాక్షి, ఇంటర్వ్యూలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పెద్దపల్లిరూరల్: శీతాకాలం ముగుస్తోంది. వేసవి ఆరంభమవుతోంది. వాతావరణం మారుతోంది. ఈ రెండింటి మధ్య వ్యత్యాసంతో పట్టణవాసులు జలుబు, జ్వరం, ఇతరత్రా సీజనల్ వ్యాధులకు గురవుతున్నారు. ప్రజలు వ్యాధులకు గురవకుండా తమ అధికార యంత్రాంగం అప్రమత్తమైందని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ వెల్లడించారు. ప్రత్యేకంగా పారిశుధ్యం మరింత మెరుగుపర్చుతున్నామన్నారు. రోడ్లకు ఇరువైపులా మురుగునీటి కాలువలు నిర్మించే పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. దోమల నియంత్రణకు ఫాగింగ్ చేయిస్తున్నామని చెప్పారు. ఖాళీగాఉన్న ప్లాట్లలో నీరు నిల్వ ఉండకుండా యజమానులకు నోటీసులు జారీచేశామన్నారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..



వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్, పెద్దపల్లి

సాక్షి: వీధుల్లో పారిశుధ్యం లోపిస్తోంది?

కమిషనర్: కొత్త కాలనీల్లో ఈ సమస్య కొద్దిగా ఉంది. ఆయా ప్రాంతాలతో పాటు ప్రధాన రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీలు నిర్మిస్తున్నాం. పారిశుధ్య సమస్యను పరిష్కరిస్తున్నాం.

సాక్షి: ఖాళీ ప్లాట్లలో మురుగునీరు చేరి దోమలు వృద్ధి చెందుతున్నాయి?

కమిషనర్: ఖాళీ ప్లాట్లలో పిచ్చిమొక్కలు పెరగడం, సమీప ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు అందులో చేరకుండా చూడాలని గతంలో ప్లాట్ల యజమానులకు నోటీసులిచ్చాం. మళ్లీ వాటిపై దృష్టి సారిస్తాం. అవసరమైన చర్యలు తీసుకుంటాం.

సాక్షి: దోమలను ఎలా నియంత్రిస్తారు?

కమిషనర్: దోమలు వృద్ధి చెందకుండా క్రమం తప్పకుండా అన్ని వీధుల్లో ఫాగింగ్ చేయిస్తున్నాం. డ్రెయినేజీల్లో ఆయిల్‌బాల్స్ వేయిస్తున్నాం. వార్డు ఆఫీసర్లు, సిబ్బంది కూడా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు.

సాక్షి: మురుగుకాలువల్లో చెత్తాచెదారం వేయడాన్ని నియంత్రించారా?

కమిషనర్: ఇళ్ల నుంచి వెలువడే తడి, పొడి చెత్తను వేర్వేరుగా డబ్బాల్లో ఉంచి ఇంటికి వచ్చే సిబ్బందికి అందించాలని ప్రజలకు అవగాహన కల్పించాం. ప్రజలు కూడా చెత్తను వేర్వేరుగా అందించి సిబ్బందికి సహకరించాలి.

సాక్షి: పారిశుధ్యం మెరుగుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

కమిషనర్: రోజురోజుకూ పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా పారిశుధ్యం మెరుగుపర్చేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. వార్డుల వారీగా వాహనాలను ఏర్పాటు చేసి మా సిబ్బందిని ఇళ్లకు పంపిస్తున్నాం. ఇంటింటా చెత్త సేకరిస్తున్నాం. మురుగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.





పెద్దపల్లిలో జాగారం చేస్తున్న భక్తురాలు, వేములవాడలో మహాలింగార్చన పూజల్లో వేదపండితులు





పెద్దపల్లిలో భక్తురాలు.. వేములవాడలో శివసత్తుల పూనకం





వేములవాడలో రాజరాజేశ్వరస్వామికి మొక్కులు చెల్లిస్తూ..

హరహర మహాదేవ..

పెద్దపల్లిరూరల్/వేములవాడ: హర.. హర మహాదేవ.. శంభోశంకర.. ఓం నమఃశివాయ నామస్మరణలతో శివాలయాలు మార్మోగాయి. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బుధవారం శివుని దర్శనం కోసం భక్తులు ఆలయాల్లో పోటెత్తారు. వేకువజాము నుంచే ఆలయాల్లో బారులు తీరారు. ప్రసిద్ధ వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామిని లక్షలాది మంది భక్తులు దర్శించుకున్నారు. అక్కడ జాగారం ప్రారంభించారు. పలువురు ప్రముఖులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా జిల్లాలోని గోదావరిఖని, మంథని, పెద్దపల్లి, సుల్తానాబాద్, ఓదెల తదితర ప్రాంతాల్లోని శివాలయాలు భక్తుల రాకతో మార్మోగాయి.



నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు - సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



గోదావరిఖనిటౌన : గోదావరి తీరంలో స్నానాలు



ఓదెల : మల్లన్న సన్నిధిలో నృత్య ప్రదర్శనలు



అంతర్గాంలో వాయినాలు ఇచ్చుకుంటున్న భక్తులు





వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి దర్శనం కోసం భక్తుల బారులు, కోనేరులో పుణ్యస్నానాలు



ఎలిగేడు : స్వామివారి దర్శనం కోసం బారులు



పెద్దపల్లిలోని శివాలయంలో భక్తుల పూజలు



పెద్దపల్లి రూరల్ : స్వామివారి కల్యాణం









ధర్మారం : స్వామివారి సన్నిధిలో విప్ అడ్లూరి, గోదావరిఖనిలో ఎంపీ వంశీ, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, విజయరమణారావు తదితరుల పూజలు

క్లుప్తంగా

'కరువుకు కేరాఫ్ కాంగ్రెస్'


మాట్లాడుతున్న కోరుకంటి చందర్

గోదావరిఖని: కరువుకు కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ నిలిచిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ విమర్శించారు. నీళ్లు లేక ఎండిపోయిన గోదావరి నదిని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో గోదావరినది నిండుకుండలా ఉండేదన్నారు. కాంగ్రెస్ పాలనలో నీళ్లు లేక వెలవెలబోతోందని అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు గోదావరిలో స్నానం ఆచరించడం ఆనవాయితీ అని, ఇప్పుడు నీరు లేక భక్తులు ఇబ్బందులు పడ్డారని అన్నారు. నాయకులు వెంకన్న, కోడి రామకృష్ణ, ఆవునూరి వెంకటేశ్, రామరాజు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ


సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శ్రీనివాస్

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రంలోని ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ బుధవారం రాత్రి తనిఖీ చేశారు. ప్రిసైడింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. భోజన సదుపాయాలు, లైటింగ్ ఏర్పాట్లు పరిశీలించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఎస్సై వెంకటేశ్‌ను ఆదేశించారు. పెద్దపల్లి డీసీపీ చేతన, ఏసీపీ కృష్ణ, సుల్తానాబాద్, పెద్దపల్లి సీఐలు సుబ్బారెడ్డి, ప్రవీణ్‌కుమార్, ఎస్సై వెంకటేశ్, ఏఎస్సై నీలిమ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు ఎంపిక


రవినందన్‌రావు

పెద్దపల్లిరూరల్: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు జిల్లా సైన్స్ అధికారి రవినందన్‌రావు ఎంపికయ్యారని డీఈవో మాధవి తెలిపారు. కన్నాల ప్రభుత్వ పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడైన రవినందన్‌రావు.. శుక్రవారం ఎస్‌సీఈఆర్‌టీ నిర్వహించే సదస్సులో అవార్డు అందుకోనున్నారని పేర్కొన్నారు. 'సైన్స్ ఇన్ అవర్‌వరల్డ్' ప్రధాన ఇతివృత్తంతో సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. విజ్ఞానశాస్త్ర విద్యలో ప్రమాణాలు పెంచేందుకు శాస్త్రీయ మార్గాలు ఉపఅంశంలో రవినందన్‌రావు తన పరిశోధనాపత్రం సమర్పిస్తారని వివరించారు. రెండేళ్లపాటు నిర్వహించిన సంచార ప్రయోగశాల ద్వారా కృత్యాధార బోధనలోని పలు అంశాల ఆధారంగా ఈపత్రం రూపొందించారన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉన్నత పాఠశాలల నుంచి రవినందన్‌రావు ఈ సదస్సుకు ఒక్కరే ఎంపికయ్యారని వివరించారు. డీఈవోతోపాటు సమన్వయకర్తలు పీఎం షేక్, మల్లేశ్, కవిత, కమలాకర్‌రావు ఆయనను అభినందించారు.

పదండి.. ఓటేద్దాం

- సరైన నాయకుడిని ఎన్నుకుందాం
- సిద్ధమంటున్న పట్టభద్రులు, ఉపాధ్యాయులు
- నేటి ఎమ్మెల్సీ ఎన్నికలకు రెడీ


పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది

సప్తగిరికాలనీ(కరీంనగర్): సమాజంలో మార్పు తీసుకొచ్చే సత్తా యువతకే ఉంటుంది. యువతను సన్మార్గంలో నడిపించే శక్తి ఉపాధ్యాయులకు ఉంటుంది. యువత, ఉపాధ్యాయులు కలిసి ఓటు హక్కు అనే బ్రహ్మాస్త్రాన్ని సక్రమంగా వినియోగించుకుంటే.. ఒక నికార్సయిన ప్రజాప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఉంటుంది. పెద్దల సభలో పట్టభద్రులు, ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తే గొంతును కూర్చోబెట్టే సమయం వచ్చింది. ఈ నెల 27న(నేడు) కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీకి 3.5లక్షలకు పైగా, ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి సుమారు 27వేల మందికి పైగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడమే కాదు.. నేడు జరిగే ఓటింగ్‌లో పాల్గొని.. ప్రలోభాలకు లొంగకుండా మంచి అభ్యర్థులను ఎన్నుకునేందుకు సమాయత్తం కావాలి. ఈ క్రమంలో పదండి ఓటేద్దాం.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తాచాటుదాం అంటున్నారు.. పలువురు పట్టభద్రులు.. ప్రయివేటు ఉపాధ్యాయులు.!!

తొలిసారి వేస్తున్నా



నేను ప్రైవేటు ఉపాధ్యాయుడిని. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలిసారి ఓటేయబోతున్నా. చాలా సంతోషంగా ఉంది. రోజు చాలా వాయిస్ కాల్స్ వచ్చాయి. అభ్యర్థులు తక్కువ సంఖ్యలో ఉన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే వారికే నా ఓటు. ప్రతీ ఒక్కరు ఓటును వినియోగించుకోవాలి.

– నవక్రాంత్‌రెడ్డి

గోడు విన్న వారికే



తొలిసారి ప్రభుత్వం ప్రైవేటు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు ఓటుహక్కు కల్పించింది. మా గోడు చెప్పుకునే అవకాశం దక్కింది. ఇన్ని సంవత్సరాలు మమ్ముల్ని ఎవరూ పట్టించుకోలేదు. చాలీచాలనీ జీతాలతో నానా తంటాలు పడుతున్న మాకు దారి చూపించే వారికే నా ఓటు.

– వి.తిరుపతిరావు

నిస్వార్థపరులకే



నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించే నిస్వార్థపరులను ఈ ఎన్నికల్లో ఎన్నుకోవాలి. స్వార్థం లేకుండా అభివృద్ధి ధ్యేయంగా పనిచేసే వారిని గెలిపించండి. గెలిచిన అభ్యర్థులు తాను ఇచ్చిన హామీలు నెరవేర్చే నాయకులను ఎన్నుకోండి.

– ఆమని

మాట తప్పనివారికి



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేసే విషయంలో మాట తప్పని వారికి ఓటు వేయాలి. ఓట్ల కోసం అమలు చేయలేని హామీలను గుప్పిస్తున్న వారికి ఓటువేసే ముందు నేటి యువత ఆలోచించాలి. అభివృద్ధికి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చిన వారిని ఎన్నుకోవాలి.

– టి.కార్తీక్

అవగాహన ఉన్నవారికి



ఈ సారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తీవ్రమైన పోటీ నెలకొంది. బరిలో ఉన్న అభ్యర్థి ఎవరైనా.. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో అవగాహన ఉన్న వారికి ఓటేయ్యాలి. నిత్యం అందుబాటులో ఉంటూ.. సమస్యలు పరిష్కరించేవారిని ఎన్నుకోవాలి. ప్రజలతో మమేకమైనవారికే నా ఓటు.

– డి. శ్రీనివాస్

నోటుకు ఆశపడొద్దు



పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే వారికే ఓటేయండి. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులు అందుబాటులో ఉంటూ సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తారో వారిని ఎన్నుకోండి. ఓటును నోటుతో కొనాలన్నది నేటి రాజకీయం. ఓటు వజ్రాయుధం, నోటుకు ఆశపడకుండా ఓటేయాలి.

– పి.మాధురి

ఓటుతో బుద్ధి చెప్పాలి



నిస్వార్థంతో పనిచేసే వ్యక్తికే ఓటేయ్యాలి. తన కుటుంబం, బంధుప్రీతి అనే భావన ఉండకూడదు. పట్టభద్రులంతా తన కుటుంబంగానే భావించాలి. పదవులు పొందే అవకాశం వచ్చిందని, పట్టభద్రుల బాగోగులు పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా స్వార్థంతో పనిచేసే వారికి ఓటుతో బుద్ధి చెప్పాలి.

– బత్తిని వేణు

సమస్యలపై స్పందించే వారికే



సమస్యలపై స్పందించి, పరిష్కరించే వారికే నా ఓటు. గెలిచిన అభ్యర్థులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలి. ఓటును నోటుతో కొనాలన్నది నేటి రాజకీయం. మన ఓటు వజ్రాయుధం లాంటిది. నోటుకు ఆశపడకుండా ఓటు వేసే విధంగా సిద్ధం కండి.

– అనూప్ కుమార్

ఒక టెంటు.. రెండు డ్రమ్ములు

- గోదావరి తీరంలో ఏర్పాట్లు మమ
- పుణ్యస్నానాలకు భక్తుల ఇబ్బందులు
- సౌకర్యాల కల్పనలో బల్దియా అధికారుల విఫలం


గోదావరి ఒడ్డున ఏర్పాటు చేసిన టెంటు, డ్రమ్ములు

కోల్‌సిటీ(రామగుండం): మహాశివరాత్రి అంటేనే పవిత్ర గోదావరి నదిలో మూడు మునకలేసి ముక్కంటికి మొక్కులు సమర్పించి ఉపవాసంతో జాగారం చేయడం. దక్షిణ గంగగా పేరొందిన గోదావరి నదిలో పవిత్ర స్నానాలు ఆచరించడానికి ఏటా సుమారు లక్ష మంది వరకు భక్తులు వచ్చేవారు. ఈసారి ఏర్పాట్లు చేయడంలో రామగుండం నగరపాలక సంస్థ విఫలం కావడంతో భక్తుల సంఖ్య విపరీతంగా పడిపోయింది. నదిలో నీరు లేదని తెలిసినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయింది. సింగరేణి అధికారులు ఫిల్టర్‌బెడ్ వద్ద కొన్ని ఏర్పాట్లు చేయడంతో భక్తులు ఊరట చెందారు.

పూర్తిస్థాయి కమిషనర్లు ఉన్నప్పుడు..

సుందిళ్ల బ్యారేజీ నిర్మించకముందు బల్దియాకు పూర్తిస్థాయి కమిషనర్లు ఉన్నప్పుడు శివరాత్రి సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా గోదావరి నదిలో ఏర్పాట్లకు వారం ముందు నుంచే సన్నాహాలు చేసేవారు. ఇంజినీర్ల పర్యవేక్షణలో ఇసుక బస్తాలు వేసి చిన్న ప్రవాహానికి కూడా అడ్డుగా కట్టలు కట్టి నీరు నిల్వచేసేవారు. ప్రస్తుతం చిన్నపాయ ఉంది. అందులోనూ మురుగునీరే పారుతోంది. అయినా, పట్టించుకునే వారే కరువయ్యారు.

బోర్లు ఏమయ్యాయి?

నదిలో బోర్లు వేసి ఒకేసారి అధిక సంఖ్యలో భక్తులు ట్యాప్‌ల కింద స్నానం ఆచరించేలా అధికారులు గతంలో ఏర్పాట్లు చేశారు. హిందూ మతపెద్దలతో ఇందుకోసం కార్యాచరణ రూపొందించేవారు. ఈసారి ఆ ఆలోచన చేయలేదు. పుష్కరఘాట్ సమీపంలోని మహాశివుని విగ్రహానికి కనీసం రంగులు కూడా వేయలేదు. మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే గదుల మాట దేవుడెరుగు.. విద్యుత్ దీపాలు కూడా ఏర్పాటు చేయలేదు.. సమీపంలోని మంచిర్యాల బల్దియా.. తమ వైపు ఉన్న గోదావరి తీరంలో ఆధ్యాత్మికత ఉట్టిపడేలా విద్యుత్ స్తంభాలు, కూడళ్లలో పలు అకృతులతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. రామ గుండం బల్దియా కొన్ని సాధారణ లైట్లు పుష్కర ఘాట్ వద్ద, మరికొన్ని జనగామ శివాలయం వద్ద ఏర్పాటు చేసింది. ఏవో కొన్ని సిరీస్ బల్బులు పెట్టి సరిపుచ్చింది. పుష్కర ఘాట్ వద్ద అపరిశుభ్రమైన రెండు డ్రమ్ములు, ఒక టెంట్, దానికో బ్యానర్ పెట్టి తాగునీటి సౌకర్యం కల్పించినట్లు భ్రమలు కల్పించింది. పారిశుధ్య నిర్వహణ కూడా అంతంత మాత్రంగానే ఉందనే ఆరోపణలు వచ్చాయి. ఒకవైపు పాలకవర్గం లేకపోవడం, మరోవైపు పూర్తిస్థాయి కమిషనర్ లేనిలోటు శివరాత్రి ఏర్పాట్లకు వైఫల్యంగా పేర్కొంటున్నారు. ఈ విషయంపై బల్దియా కమిషనర్(ఎఫ్ఏసీ) అరుణశ్రీని సంప్రదించగా.. శివరాత్రి సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జనగామ శివాలయం వద్ద లైటింగ్, తాగునీటి సౌకర్యం కల్పించామన్నారు. పారిశుధ్యం నిర్వహణకు సిబ్బందిని నియమించామని తెలిపారు. గోదావరి నదీతీరంలో టెంటు వేసి తాగునీటి సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. నదిలో నీటి పారకం తగ్గడంతో షవర్ స్టాండ్ పెట్టినట్లు వివరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాలను అదనపు కలెక్టర్ వేణు బుధవారం పరిశీలించారు. ఈనెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లోని రెండు పోలింగ్ కేంద్రాలు, వాటి వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తుపై ఆరా తీశారు. ఓటర్ల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తాగునీరు అందుబాటులో ఉంచాలని అన్నారు. తహసీల్దార్ జగదీశ్వర్‌రావు, ఎస్సై వెంకటేశ్, ఏఎస్సై నీలిమ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి భక్తుడి ప్రాణాలు కాపాడిన ఎస్సై


శ్రీనివాస్‌కు సీపీఆర్ చేస్తున్న ఎస్సై రమేశ్


శ్రీనివాస్‌ను ఆస్పత్రికి తరలిస్తున్న ఎస్సై రమేశ్

ఓదెల(పెద్దపల్లి): హఠాత్తుగా గుండెపోటుకు గురైన భక్తుడికి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడారు ఎస్సై రమేశ్. పెద్దపల్లి జిల్లా ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు.. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన భక్తుడు ఒరుసు శ్రీనివాస్ మహాశివరాత్రి సందర్భంగా బుధవారం ఓదెల శ్రీమల్లికార్జునస్వామి దర్శనం కోసం తరలివచ్చాడు. స్వామివారి దర్శనం చేసుకుంటుండగా హఠాత్తుగా గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ వెంటనే సీపీఆర్ చేశారు. దీతో భక్తుడు స్పృహలోకి రావడంతో ఓ వాహనంలో స్థానిక ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి కరీంనగర్‌లోని ఆస్పత్రికి తరలించారు. పండుగపూట తమ కుమారుడు ఆపదకు గురైతే.. ఎస్సై దేవుడిలా ప్రాణాలు కాపాడారని శ్రీనివాస్ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సైని పలువురు భక్తులు, స్థానికులు అభినందించారు.

ప్రయాగ్‌రాజ్ వెళ్లివస్తూ..

వీణవంక: కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎల్బాక గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నల్లగోని వీరయ్యగౌడ్ ప్రయాగ్‌రాజ్ వెళ్లివస్తూ.. గుండెపోటుతో చనిపోయాడు. నల్ల గోని వీరయ్యగౌడ్ ఐదు రోజుల క్రితం తన కుటుంబసభ్యులతో కలిసి ప్రయాగ్‌రాజ్ కుంభమేళా పుణ్యస్నానాలకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో మంగళవారం రాత్రి నిజామాబాద్ జిల్లాకు చేరుకున్న క్రమంలో వీరయ్యగౌడ్‌కు గుండెపోటు వచ్చింది. కుటుంబసభ్యులు సమీపంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయాడు. మృతునికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. వీరయ్య గౌడ్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బుధవారం పరామర్శించారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు తల్లీకూతుళ్ల ఎంపిక



పతకాలతో తల్లీకూతుళ్లు

కరీంనగర్‌స్పోర్ట్స్: సికింద్రాబాద్ జింఖానా మైదానంలో మాస్టర్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన తల్లీకూతుళ్లు ప్రతిభ కనబరిచారు. తల్లి మేరీ స్టెల్లా 50 ఏళ్ల పైన వయసు విభాగంలో జావెలిన్ త్రో, షాట్‌పుట్ పోటీల్లో బంగారు, 100 మీటర్ల రన్నింగ్‌లో రజత పతకం సాధించింది. కూతురు షీలా స్మృతి 30 ఏళ్ల పైన వయసు విభాగంలో 100 మీటర్ల రన్నింగ్‌లో రజత, 200 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకాలు గెలిచింది. తల్లీకూతురు ఏప్రిల్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని సంఘం రాష్ట్ర కార్యదర్శి రామారావు, రుబేన్ మార్క్, సుధీర్, దేవదానం, డేనియల్, సుదర్శన్, జాన్సన్ తదితరులు అభినందించారు.

'మేడిగడ్డ బరాజ్‌ను కావాలనే నీరుగార్చారు'


గోదావరి నదిని పరిశీలిసున్న పుట్ట మధు

మంథని: కాంగ్రెస్ పార్టీ కావాలనే మేడిగడ్డ బరాజ్‌ను నీరుగార్చిందని, దానిపై ఏదో లబ్ధి పొందాలని దుష్ప్రచారం చేసి 14 నెలలుగా నీళ్లు ఆపడం లేదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. మహాశివరాత్రి సందర్భంగా స్థానిక గోదావరనదీ తీరాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. మేడిగడ్డ బరాజ్‌లోని ఒక్క పిల్లర్ కుంగిపోవచ్చు కానీ పైన ఉన్న అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకు ఎలాంటి ఇబ్బందులు లేకున్నా నీళ్లు నిల్వచేయాలనే ఆలోచన చేయలేదన్నారు. మంథని ప్రాంత ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే మహాశివరాత్రి పండుగపై మంథని ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేకుండా పోయిందని ధ్వజమెత్తారు. పండుగ రోజున ప్రతీ ఒక్కరు గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి శైవక్షేత్రాలను దర్శించుకోవడం సంప్రదాయంగా వస్తోందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వంలో మంథని గోదావరినదిలో చుక్కనీళ్లు లేకుండా చేశారని ఆరోపించారు. కేవలం ఒక్కనీటి పాయ ఉంటే వేల సంఖ్యలో భక్తులు ఇబ్బందుల నడుమ స్నానాలు ఆచరిస్తున్నారని ఆయన వాపోయారు.

పరీక్షల్లో మళ్లీ ఫెయిలవుతానేమోనని..

- ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య
- శివరాత్రి రోజు చిన్నమెట్‌పల్లిలో విషాదం


సంజయ్ (ఫైల్)

కోరుట్ల రూరల్: మండలంలోని చిన్నమెట్‌పల్లికి చెందిన మోత్కూరి సంజయ్(19) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మోత్కూరి వెంకటేశం–లత దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కొడుకు సంజయ్ కల్లూర్ మోడల్ స్కూల్లో ఇంటర్ చదివాడు. గతేడాది జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో ఫెయిలయ్యాడు. అప్పటినుంచి మనోవేదనకు గురవుతున్నాడు. అయితే, ఈసారి కూడా ఫెయిలవుతానేమోనని భయపడ్డాడు. బుధవారం శివరాత్రి కావడంతో తల్లిదండ్రులు గుడికి బయలుదేరారు. వారికి తాను తర్వాత వస్తానని చెప్పి, ఇంట్లోనే ఉరేసుకున్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పురస్కారం అందుకున్న రైతు మల్లారెడ్డి



అవార్డు అందిస్తున్న శ్రీనివాసరావు

పెద్దపల్లిరూరల్: కాసులపల్లి గ్రామానికి చెందిన రైతు ఎర్రం మల్లారెడ్డి ఢిల్లీలోని పూస కృషి విజ్ఞాన మేళాలో అవార్డు అందుకున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల్లో మల్లారెడ్డి చూపిన ప్రతిభకు భారత వ్యవసాయ పరిశోధ నాసంస్థ (2024–25)కి వినూత్నమైన రైతు పురస్కారానికి ఎంపికచేసింది. ఈనెల 22న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత వ్యవసాయ పరిశోధనా సంస్థ డైరెక్టర్ శ్రీనివాసరావు రైతు మల్లారెడ్డికి అవార్డు అందజేశారు. మల్లారెడ్డిని జిల్లా వ్యసాయాధికారి ఆదిరెడ్డి తదితరులు అభినందించారు.

పిచ్చికుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

చందుర్తి(వేములవాడ): మండల కేంద్రంతోపాటు తిమ్మాపూర్‌కు చెందిన ఐదుగురిపై బుధవారం పిచ్చికుక్కలు దాడి చేశాయి. తిమ్మాపూర్‌కు చెందిన ఎడ్ల సత్తయ్య (52), చందుర్తికి చెందిన పవన్‌సాయి(11), రోషణ్(7), దీక్షిత(5), దాసరి అమృత(65)లపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. వీరికి చందుర్తి పీహెచ్‌సీలో చికిత్స చేసి వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

సీతారాంపూర్ గ్రామంలో నలుగురికి

చిగురుమామిడి: సీతారాంపూర్ గ్రామంలో పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. రోడ్డు వెంట వెళ్తున్న హన్మాండ్ల జయ్‌పాల్‌రెడ్డి, నారాయణపురం భాగ్య, ముసాపురి శ్రీనివాస్, బొట్ల శిరీష, బొట్ల చంద్రయ్యలపై పిచ్చికుక్క దాడిచేసింది.

గ్రామాల్లో మళ్లీ స్వచ్ఛబాట

- వ్యక్తిగత మరుగుదొడ్లు మంజూరు


నిర్మాణం పూర్తయిన మరుగుదొడ్లు

కరీంనగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యం, పారిశుధ్యానికి ప్రాధాన్యమిస్తూ.. ఇంటింటికి మరుగుదొడ్లు మంజూరు చేస్తున్నాయి. గతంలో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ఎంపిక చేసిన గ్రామాల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని చేపట్టింది. మూడేళ్ల క్రితం ప్రతీ గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించి బహిరంగ మలవిసర్జన రహిత(ఓడీఎఫ్)గ్రామాలుగా ప్రకటించింది. అనంతరం వ్యక్తిగత మరుగుదొడ్ల మంజూరు నిలిచిపోయింది. గ్రామాల్లో కుటుంబాలతోపాటు గృహ నిర్మాణాల సంఖ్య పెరిగిపోయాయి. మరుగుదొడ్లు లేకపోవడంతో సమస్య మళ్లీ రావడంతో అధికారులు స్వచ్ఛభారత్ మిషన్‌లో పల్లెల్లో మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు.

జిల్లాకు మొదటి విడతలో 100 మరుగుదొడ్లు

స్వచ్ఛభారత్ మిషన్ పథకంలో భాగంగా జిల్లాలోని 15 మండలాల్లోని గ్రామాలకు మొదటి విడతగా 100 మరుగుదొడ్లను మంజూరు చేశారు. ఆయా గ్రామాల్లో సగానికిపైగా నిర్మాణాలు పూర్తయ్యాయి. మరుగుదొడ్డి నిర్మించినట్లయితే రెండు విడతలో లబ్ధిదారులకు రూ.12వేలు మంజూరు చేస్తారు. ప్రస్తుతం పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో రెండో విడత మరుగుదొడ్లు మంజూరు కాలేదు. కోడ్ ముగిసిన అనంతరం మరుగుదొడ్లు మంజూరవుతాయని స్వచ్ఛభారత్ మిషన్ అధికారులు పేర్కొంటున్నారు. మరుగుదొడ్లు లేనివాళ్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మంజూరు ఇలా

కొత్తగా ఇండ్లు నిర్మించుకున్న వాళ్లు వ్యక్తిగత మరుగుదొడ్డి కోసం సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తులను గ్రామసభల్లో చదివిన అనంతరం అర్హులను ఎంపిక చేసి తీర్మాణం చేసి మండల పరిషత్తు కార్యాలయంలో అందిస్తారు.



పోలింగ్‌కు సిద్ధం

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో బుధవారం గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ వేణు పరిశీలించి ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎన్నికల సామగ్రితో సిబ్బంది తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



